


### గెలుపుపై ముగ్గురు అభ్యర్థుల్లోనూ ధీమా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది పోటీ చేశారు. వీరిలో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే ప్రధాన పోటీ నెలకొందని ఎన్నికల విశ్లేషకులు చెబు తున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రఘువర్మకు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన టీడీపీ, జనసేన పార్టీలు, గాదె శ్రీనివాసులనాయుడుకి బీజేపీలో ఉండే ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు మద్దతు పలికారు. విజయగౌరి మద్దతుగా సీపీఎంతోపాటు కొన్ని వామపక్షాలు పనిచేశాయి.


రఘువర్మ


శ్రీనివాసుల నాయుడు


విజయగౌరి

# గురువుల విజేత ఎవరో?

● నేడు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ● ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి


ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు పూర్తయిన ఏర్పాట్లు

విశాఖపట్నం/ శ్రీకాకుళం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ప్రారంభం కానున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ విభాగంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాన్ని విశాఖ జిల్లా డీఆర్వో భవానిశంకర్ ఆదివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత నెల 27న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని 123 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికల్లో 22,493మంది ఉపాధ్యాయులకుగాను 20,794 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 13,508 మందికిగాను 12,576 మంది, మహిళలు 8,985 మందికి 8,218 మంది ఓటు వేశారు.

- ● మొత్తం ఓటర్లు: 22,493, పోలైన ఓట్లు: 20,794
- ● ఓట్ల లెక్కింపునకు 20 టేబుళ్లు, 100 మంది సిబ్బంది
- ● తొలుత బ్యాలెట్ పత్రాలను కుప్పగా పోసి.. 25 చొప్పున కట్టలు
- ● డ్రమ్ములో వేసి కలియతిప్పిన తరువాత టేబుళ్లకు సర్దుబాటు
- ● తొలి ప్రాధాన్యతలో 50 శాతానికి మించి ఒక్క ఓటు వచ్చినా విజేతగా ప్రకటింపు
- ● ఇదే జరిగితే రాత్రి 8 గంటల్లోగా ఫలితం వెలువడే అవకాశం
- ● లేకపోతే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ● ఫలితం వెల్లడికి మరింత సమయం

## ఓట్ల లెక్కింపునకు 20 టేబుళ్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు అధికారులు 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద ఇద్దరు చొప్పున సిబ్బంది ఉంటారు. వీరికి అదనంగా మరికొంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు. తొలుత సోమవారం ఉదయం అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ ఓపెన్‌చేసి అక్కడ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలుకు చేరుస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు బ్యాలెట్ బాక్సుల సీళ్లను పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే తెరుస్తారు. అన్ని బాక్సుల్లోని బ్యాలెట్ పత్రాలను కుప్పగా పోస్తారు. తరువాత 25 చొప్పున ఓట్లను కట్టలుగా కడతారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఓట్ల కట్టలను డ్రమ్ములో వేసి కలియతిప్పుతారు. అనంతరం ఒక్కో టేబుల్‌కు వెయ్యి ఓట్లు.. అంటే 40 కట్టలను అందజేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం అయ్యే అవకాశం ఉంది. భోజనం చేసిన తరువాత టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. అభ్యర్థులకు వచ్చిన తొలి ప్రాధాన్యత ఓట్లను వారికి కేటాయించిన ట్రేలలో వేస్తారు. మిగిలిన ఓట్ల కట్టలను కూడా టేబుళ్ల వారీగా సర్దుబాటు చేస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొత్తం ఒక రౌండ్‌లోనే చేపడతారు. చెల్లిన ఓట్లలో 50 శాతానికి మించి ఒక్క ఓటు అదనంగా ఎవరికి వస్తే ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఇదే జరిగితే రాత్రి ఎనిమిది గంటలకల్లా ఫలితం వెలువడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఎవరికీ 50 శాతం కన్నా ఎక్కువ ఓట్లు రాకపోతే మొదటి ప్రాధాన్యత ఓట్లలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేసుకుంటూ వస్తారు. మొదటి స్థానంలో ఉన్న అభ్యర్థి ఎప్పుడైతే 50శాతం ఓట్లను అధిగమిస్తారో అప్పుడు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును నిలుపుదల చేసి, ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

### ● భారీ బందోబస్తు నడుమ..

ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖపట్నం కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ నేతృత్వంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఆర్వోలు, ఇతర అధికారులు కౌంటింగ్ కేంద్రంలో ఉంటారు. ఎన్నికల సంఘం తరఫున పరిశీలకునిగా వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంఎం.నాయక్ కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తారు. మొత్తంగా 100మంది అధికారులు, సిబ్బంది కౌంటింగ్ విధుల్లో ఉంటారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో పోటీచేసిన పది మంది అభ్యర్థుల తరఫున మొత్తం 160 మందికి కౌంటింగ్ ఏజెంట్ పాసులు జారీ చేశారు.

---

## పీసీఎంఏ ఎన్నికలు.. ఏకగ్రీవం

● టీడీపీ మద్దతుదారులకే పట్టం


పీసీఎంఏ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి రవిశంకర్‌గుప్తా, కోశాధికారి సంతోష్

పలాస, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పలాస జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం(పీసీఎంఏ) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం కార్యవర్గం అంతా టీడీపీ మద్దతుదారులే కావడం గమనార్హం. ఈ ఎన్నికలు ఈ నెల 4న జరగాల్సి ఉంది. అందుకోసం ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థుల నామినేషన్ల ఉప సంహరణ గడువు ఆదివారం చివరి తేదీ కావడంతో అంతా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం 11గంటలకు అభ్యర్థులు మల్లా సురేష్ కుమార్, కేవీ శివకృష్ణ, పట్నాన రవికాంత్ నాటకీయ పరిణామాల మధ్య నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో అధ్యక్షుడిగా మల్లా శ్రీనివాసరావు, కార్యదర్శి టంకాల రవిశంకర్‌గుప్తా, కోశాధికారి మల్లా సంతోష్‌కుమార్ ఎంపిక లాంఛనమైంది. ఈ ఎన్నికల ఏకగ్రీవమైనట్టు ఎన్నికల కమిటీ సభ్యులు మల్లా భాస్కరరావు, బెల్లాల నారాయణరావు, తర్లాన రమేష్ ప్రకటించారు. మొత్తం ఎనిమిది మంది నామినేషన్లు వేయగా ఐదుగురు ఉపసంహరించుకున్నట్టు వారు తెలిపారు. రెండేళ్లపాటు కొత్త కార్యవర్గం కొనసాగుతుంది. పార్టీలకు అతీతంగా వ్యాపారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని, తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న వ్యాపారులకు అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు ధన్యవాదాలు తెలిపారు. నూతన సంఘాన్ని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, పారిశ్రామికవాడ వ్యాపార సంఘ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు అభినందించారు. అలాగే ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా ప్రధానకార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, జోగమల్లి, అంబటి రామకృష్ణ, కొత్త సత్యం, నర్సింహులు కూడా కార్యవర్గాన్ని అభినందించారు.

## భవనం పూర్తయ్యేదెప్పుడో?

8లో

● కొత్తూరు సామాజిక ఆసుపత్రిలో రోగులకు తప్పని ఇబ్బందులు

---


అన్నప్రసాదం కేంద్రం వద్ద ఎండలో అవస్థలు పడుతున్న భక్తులు

## మానవత్వం ఏదీ?


సొమ్మసిల్లిన చిన్నారి

- ● అరసవల్లిలో భక్తులకు అరకొర సౌకర్యాలు
- ● క్యూలో నిల్చొని ఎండ తీవ్రత తట్టుకోలేక సొమ్మసిల్లిన బాలిక
- ● అన్నప్రసాదం కేంద్రంలోకి అనుమతించని సెక్యూరిటీ
- ● చిన్నారి తండ్రి బతిమలాడినా కనికరించని వైనం

అరసవల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. అరసవల్లిలోని ఆదిత్యుడి ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. నీడ సౌకర్యం లేక ఎండలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు సెక్యూరిటీ సిబ్బంది సైతం మానవత్వం లేకుండా భక్తులపై అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆదిత్యుడ్ని దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా నిత్యం అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. స్వామిని దర్శించుకుని.. అన్నప్రసాదాలు స్వీకరిస్తుంటారు. కాగా.. అన్నప్రసాదం కోసం వచ్చే భక్తులకు ఆలయ అధికారులు.. ఎండ నుంచి ఎటువంటి రక్షణ కల్పించడం లేదు. ఆదివారం అన్నప్రసాదం కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు బారులుదీరి.. ఎండలో అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన ఓ నాలుగేళ్ల బాలిక అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో ఆ చిన్నారి తండ్రి, కుటుంబ సభ్యులు వెంటనే సపర్యలు చేశారు. తన కుమార్తెకు ఆకలిగా ఉందని, వెంటనే అన్నప్రసాదం కేంద్రంలోకి తీసుకెళ్లి భోజనం పెట్టాలని అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డును తండ్రి వేడుకున్నాడు. పెద్ద క్యూ లైన్ ఉందని, ఓ వైపు ఎండ.. మరో వైపు ఆకలితో ఆ చిన్నారి ఉండలేకపోతోందని వివరించాడు. అయినా సెక్యూరిటీ గార్డు అన్నప్రసాదం కేంద్రంలోకి విడిచిపెట్టలేదు. నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించడంతో ఆ తండ్రి ఆవేదన చెందాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ ఎస్ఐని కూడా అనుమతి కోసం ప్రాధేయపడ్డాడు. ఆయన కూడా కనికరించకపోవడంతో ఏమి చేయాలో తెలియక విలవిల్లాడిపోయాడు. చివరకు అతి కష్టంమీద లోపలకు వెళ్లి ప్లేటులో భోజనం తీసుకుని బయటకు వచ్చాడు. ఎక్కడా నీడ కూడా లేకపోవడంతో ఆలయ పుష్కరిణి వద్ద చెత్తను సేకరించే ట్రాక్టరు ట్రాలీ నీడలో ఆ బాలికకు ఆహారం పెట్టాడు. కాగా.. ఆ బాలికకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సెక్యూరిటీ సిబ్బంది తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నప్రసాదం కేంద్రం వద్ద నీడ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

---

## ఉత్తమ బోధనకు కేరాఫ్ అంబేడ్కర్ గురుకులాలు



- ● ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ● నేటితో గడువు సరి
- ● ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష

7లో

## ఒక్కరోజే.. 100 కేసులు

● పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు

శ్రీకాకుళంక్రైం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మోటారు వాహన చట్టంలో కొత్త నిబంధనలను పోలీసులు పక్కాగా అమలు చేస్తున్నారు. శనివారం నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రాగా.. తొలిరోజు వాహనదారులకు పూలు ఇచ్చి.. అవగాహన కల్పించారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ తనిఖీలు చేశారు. శ్రీకాకుళంలో ఆదివారం ఒక్కరోజే 100 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. అందులో హెల్మెట్ ధరించని 18 మందికి రూ.వెయ్యి చొప్పున అపరాధ రుసుం విధించారు.వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందేనని ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. ఏడురోడ్ల కూడలిలో నూతన మోటారు వాహన చట్టాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

---



## కష్టాల సాగు..

- ● ఎండిపోతున్న వరి, వేరుశనగ పంటలు
- ● కాలువల ద్వారా అందని సాగునీరు
- ● రైతులకు తప్పని ఇబ్బందులు

పోలాకి మండలం చీడివలసలో వంశధార కాలువ నుంచి మోటారు ఇంజన్ల ద్వారా వేరుశనగ పంటకు నీటిని అందిస్తున్న దృశ్యమిది. పోలాకి, నరసన్నపేట, జలుమూరు మండలాల్లోని చీడివలస, చెల్లాయివలస, జిల్లేడివలస, జమ్ము, తామరాపల్లి, టెక్కలిపాడు తదితర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది వందలాది ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. ప్రస్తుతం పంట చివరి దశకు చేరుకుంది. కాగా.. నీటి తడి ఉంటే కానీ వేరుశనగ పంట తీసేందుకు వీలుపడదు. దీంతో రైతులు సుదూర ప్రాంతాల్లోని కాలువలు, చెరువుల్లో ఉన్న నీటిని రెండు, మూడు మోటారు ఇంజన్ల సహాయంతో తోడి.. పంటకు అందిస్తున్నారు.

నరసన్నపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రబీసీజన్‌లో వరిపంట చేతికి వచ్చే సమయంలో రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. సక్రమంగా సాగునీరు అందక పంట పొలాలు బీటలు వారుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడో కాలువలు, చెరువుల్లో ఉన్న నీటిని మోటారు ఇంజన్ల ద్వారా పంటకు అందించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో వంశధార కాలువ దిగువన నరసన్నపేట, జలుమూరు, సారవకోట మండలాల్లో సుమారు 3 వేలు ఎకరాల్లో వరి సాగు చేశారు. రెడ్డికపేట, గొట్టిపల్లి, కరగాం, నర్సింగపల్లి, జమ్ము, కంబకాయి. టెక్కలిపాడు, బసివాడ, గుగ్గలి, వెలుసోద, తాళ్లవలస, పాగోడు, జలుమూరు, బద్రి, గోపాలపురం తదితర గ్రామాల్లో రైతులు అధికంగా వరి పండిస్తున్నారు. గతేడాది మాదిరి సాగునీరు వస్తుందని ఆశించి.. వేలాది రూపాయలు (మిగతా 8వ పేజీలో..)


జమ్ము వద్ద వరిపంటకు పైపు ద్వారా నీటిని అందిస్తున్న రైతు

---

## సీనరేజ్ చార్జీలు చెల్లించారా?

- ● గ్రానైట్ క్వారీలకు వాణిజ్య పన్నుల శాఖ సమన్లు
- ● 6వ తేదీలోగా వివరాలు సమర్పించాలని స్పష్టం
- ● ఫ్యాక్టరీ యజమానుల్లో కలవరం


టెక్కలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నీలిరంగు గ్రానైట్ క్వారీలకు సంబంధించి వాణిజ్య పన్నుల శాఖ పన్నులు చెల్లింపు అంశమై సెక్షన్ 70 కింద సమన్లు జారీ చేసింది. 2023 నుంచి ఇప్పటివరకూ ప్రభుత్వానికి పన్నుల రూపంలో సీనరేజ్ చార్జీలు చెల్లించారా? లేదా? అని ప్రస్తావించింది. ఎంతమేర చెల్లించారు.. ఎంత బకాయి ఉందన్న వివరాలను ఈ నెల 6వ తేదీలోగా నరసన్నపేటలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి వచ్చి తెలియజేయాలని సమన్లలో పేర్కొంది. కాగా తాము ఎప్పటికప్పుడు సీనరీస్ చార్జీలు చెల్లిస్తున్నా.. సమన్లు రావడంతో క్వారీ యజమానులు కలవరపడుతున్నారు.

జిల్లాలోని ప్రస్తుతం 105 గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ నిర్వహణ.. యాజమాన్యాలకు గుదిబండగా మారింది. గతంలో క్యూబిక్ మీటర్‌కు సీనరేజ్ చార్జీ రూ.2,500 ఉండేది. గ్యాంగ్‌సా బ్లాకుకు రూ.3,500 ఉండేది. వైసీపీ హయాంలో ఈ సీనరీస్ చార్జీలకు అదనంగా 65శాతం కన్సరడైజేషన్, మెరిట్‌ఫండ్స్ పేరిట పెంచేశారు. అలాగే సీఎఫ్‌వో, సీఎఫ్‌ఈ పర్యావరణ అనుమతులంటూ హెక్టార్‌కు రూ.75వేల వరకు పెంచుతూ గ్రానైట్ క్వారీలపై అదనపు భారం మోపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో(2014- 2019 మధ్య) హెక్టార్‌కు రూ.500 ఉండగా.. వైసీపీ ప్రభుత్వం రూ.75 వేల వరకూ పెంచడం క్వారీ యాజమాన్యాలకు తలకుమించిన భారమైంది. అలాగే గత ఐదేళ్లు గ్రానైట్ క్వారీలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ వేలం పేరిట అనేక ఇబ్బందులకు గురిచేశారు. దరఖాస్తుదారుడు కొత్త క్వారీలకు సంబంధించి పొందుపరిచిన జియో కో-ఆర్డినేట్స్ ఆధారంగా సర్వేలు చేయకుండానే గనులశాఖ అధికారులు ఆక్షన్ వేయడం పరిపాటిగా మారింది. అనుకూలమైన వారికి ఆక్షన్లు పేరిట అనుమతులు మంజూరు చేయడం వారి వంతైంది. కాగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా.. క్వారీలకు సంబంధించి ఆక్షన్(వేలం) విధానం అమలుపై స్పష్టత ఇవ్వడం లేదు. ఆక్షన్ అమలు చేస్తారా? లేదంటే టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిరి అప్లికేషన్ విధానం అమలు చేస్తారనేది తేల్చడం లేదని క్వారీ యాజమానులు పేర్కొంటున్నారు. తాజాగా పన్నుల చెల్లింపు అంశంపై వాణిజ్య పన్నులశాఖ సమన్లు జారీ చేయడంతో మరింత ఆందోళన చెందుతున్నారు.

● వాస్తవానికి గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు విక్రయించిన బ్లాక్‌కు సంబంధించి సీనరేజ్ చార్జీలు చెల్లిస్తున్నారు. సీనరేజ్ చార్జీలు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, కన్సరడేషన్ ఫండ్, మెరిట్, ఐటీ విభాగాలకు చెల్లించిన తరువాతనే బ్లాకులు తరలించేవారు. వైసీపీ హయాంలో విశ్వసముద్ర సంస్థకు సీనరేజ్ చార్జీలు చెల్లించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఏఎంఆర్ సంస్థకు కూడా చెల్లిస్తూనే వస్తున్నారు. అయితే ఆయా సంస్థలకు క్వారీ యాజమాన్యాలు (మిగతా 8వ పేజీలో..)


టెక్కలిలో గ్రానైట్ క్వారీ

# ఉత్తమ బోధనకు కేరాఫ్ అంబేడ్కర్ గురుకులాలు




దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల

- ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- నేటితో గడువు సరి
- ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష

ఎచ్చెర్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సాంఘిక సం క్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురు కుల పాఠశాల/కళాశాలలు ఉత్తమ బోధనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలు స్తున్నాయి. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన, ధీటైన శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దుతారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తారు. ఈ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 6న వేర్వేరుగా నిర్వహించనున్నారు.

**ఇవీ ప్రత్యేకతలు..**

అంబేడ్కర్ గురుకులాల్లో ఉత్తమ సంస్కృతి, విలువలు పెంపొందించడం, వ్యక్తిత్వ వికాసం, క్షేత్ర పర్యటన ద్వారా విద్యార్థులను ఉత్తేజపర్చడం, పర్యావరణంపై అవగాహన, వ్యాయామంలో శిక్షణ ఇస్తారు. అలాగే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేలా తరగతులు నిర్వహిస్తారు. కొన్ని కళాశాలల్లో కరాటే శిక్షణ, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, గీతాలాపన, చిత్రలేఖనం, సాంఘిక నాటకాలు, శాస్త్రీయ నృత్యాల్లో తర్ఫీదునిస్తారు. అధునాతన శాస్త్ర సాంకేతిక పరిశోధనల దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తారు. ఇంటర్మీడియట్‌తో పాటు నీట్, జేఈఈ, ఏపీఈఏపీ సెట్‌లకు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ, నవీన సాంకేతికతను వినియోగించి డిజిటల్ బోధన, పర్సువల్ క్లాస్‌రూమ్స్, కంప్యూటర్ బోధన ఉంటుంది. ఐదో తరగతి విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన బోధన అందిస్తారు. ఉచిత భోజన, వసతి కల్పిస్తారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, వ్యాయామానికి అవసరమైన ట్రాక్‌సూట్, బూట్లు, ట్రంకు పెట్టె, స్టీలుప్లేటు, గ్లాసు, బెడ్డింగ్, పాదరక్షలు, కాస్మోటిక్స్ ఉచితంగా అందజేస్తారు.

**ఇవీ అర్హతలు..**

ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2012 నుంచి 31-8-2016 సంవత్సరాల మధ్య, ఓసీ, బీసీ, కన్వర్టడ్ క్రిస్టియన్ పిల్లలు 1-9-2014 నుంచి 31-8-2016 మధ్య జన్మించిన వారై ఉండాలి. ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 31-8-2025 నాటికి విద్యార్థులకు 17 ఏళ్లు మించరాదు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నవారు మాత్రమే అర్హులు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు. ప్రతి గురుకుల పాఠశాల/ కళాశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటలకు ఐదో తరగతి, అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల మధ్య ఇంటర్ ప్రవేశ పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు దరఖాస్తులో ఇచ్చిన ఆప్షన్, ప్రవేశ పరీక్షల్లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్లను పరిశీలించి సీట్లు కేటాయిస్తారు. ప్రభుత్వ పాఠశాల లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీటు ఇస్తారు.

**జిల్లాలో పరిస్థితి..**

జిల్లాలో దుప్పలవలస, కొల్లివలస, కంచిలిలో బాలుర గురుకులాలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ఉన్నాయి. ఎచ్చెర్ల, పెద్ద పాడు, నందిగాం, మందస, పాతపట్నంలో బాలికల గురుకులాలు ఉన్నా యి. నందిగాంలో ఎంఈసీ, సీఈసీ గ్రూపులు, మిగిలిన అన్ని కళాశాల ల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నా యి. ఒక్కో గ్రూపులో 40 వంతున సీట్లు ఉన్నాయి. తామరాపల్లిలో కేవలం ఇంటర్మీడియట్ తరగతు లను మాత్రమే నిర్వహిస్తారు. అలాగే ఒక్కొక్క పాఠశాలలో ఐదో తరగతిలో 80 సీట్లు చొప్పున ఉంటాయి.

**సద్వినియోగం చేసుకోవాలి**

గురుకుల పాఠశాల/కళాశాలల్లో ఉత్తమ బోధన, అత్యుత్తమ శిక్షణ ఉంటుంది. గతంలో ఈ కళాశాలల్లో చదివిన విద్యార్థులు ఎందరో ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నారు. మెరుగైన బోధనతో పాటు నైతిక విలువలు, సంప్రదాయాలపై కూడా శిక్షణ ఇస్తాం. సంస్కృతి, క్రీడలకు ప్రాధాన్యం ఉంటుంది. శతశాతం ఫలితాలను ఏటా సాధిస్తున్నాం. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు నిర్దేశించిన తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**- బి.బుచ్చిరాజు ప్రిన్సిపాల్, అంబేడ్కర్ గురుకుల కళాశాల, దుప్పలవలస**

## వైభవంగా రాజమ్మ జాతర

- భక్తుల సముద్ర స్నానాలు



జాతరలో పాల్గొన్న భక్తులు



సముద్ర తీరంలో..

గార మార్చి 2(ఆంధ్రజ్యోతి): వత్సవలస రాజమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఏటా మాఘ, ఫల్గుణ మాసంలో జరిగే ఈ జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి వివిధ పీఠాల్లో కొలువైన రాజమ్మను దర్శించుకుంటారు. శనివారం వత్సవలస చేరుకున్న భక్తులు రాత్రి బస చేసి ఉదయాన్నే దగ్గరలో ఉన్న సముద్రంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం భూలోకమ్మను దర్శించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐలు పైడపునాయుడు, బి.ప్రసాదరావు (మెరైన్), ఎస్ఐ ఆర్.జనార్దనరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

**శ్రీకూర్మం క్షేత్రంలో..**

ప్రసిద్ధ శ్రీకూర్మం క్షేత్రంలో కూర్మనాథుని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూలో నిలుచున్నారు. తాబేళ్ల పార్కు, లక్ష్మీతాయారు సన్నిధి కూడా భక్తులు దర్శించుకున్నారు. ఈవో గురునాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

ఇచ్ఛాపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ పరిధిలో గత నెలలో 20 మద్యం కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఒడిశా మద్యంపై తొమ్మిది కేసులు, డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై 11 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఒడిశా మద్యం కేసుల్లో 87 లీటర్లు, డ్యూటీపెయిడ్ లిక్కర్ కేసుల్లో 25.84 లీటర్లు మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఒక కారును సీజ్ చేశామన్నారు. పట్టుబడిన కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఒక కేసు, ఏఈఎస్ టాస్క్‌ఫోర్స్ విభాగం వారు ఒక కేసు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీ ఇచ్ఛాపురం వారు ఎనిమిది కేసులు, స్టేషన్ హౌస్ ఇచ్ఛాపురం వారు 10 కేసులు నమోదు చేశారన్నారు. సారా, కల్తీ మద్యం, ఒడిశా మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు, గంజాయి రవాణా జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## 6 నుంచి ఎల్లమ్మ జాతర

గార, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వమరవల్లిలో ప్రసిద్ధ ఎల్లమాంబ జాతర 6,7 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ గురువారం రాత్రి ఎల్లమ్మ తిరువీధి ఉత్సవం ఉంటుందన్నారు. 7న శుక్రవారం ఉదయం ఎల్లమ్మ జాతర, జోగి పల్లకీ ఉత్సవం ఉంటుందన్నారు.

## ఆదిత్యుని ఆదాయం రూ.6.19లక్షలు

అరసవల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.6,19,397 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.3,77,100, విరాళాల ద్వారా రూ.68,837, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,73,460 ఆదాయం లభించింది.

## నిధులు మంజూరు

ఆమదాలవలస, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బూర్జ మండలంలో చేపట్టనున్న 455 పనులకు నిధులు మంజూరు జరిగినట్టు ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 29 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పథకం ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ.41.43 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులు మంజూరు చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## మసీదుల్లో సందడి

- రంజాన్ మాసం ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మసీదుల్లో సందడి వాతావరణం నెలకొంది. రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభం కావడంతో మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. నగరంలోని జామియా మసీదులో అధ్యక్షుడు మహబుల్లా ఖాన్, వైస్ ప్రెసిడెంట్ హాజీ భయ్యా, గౌరవ అధ్యక్షుడు హాజీ అమీరుల్లా బేగ్, సెక్రటరీ అక్బర్ బాషా, ట్రెజరర్ ఉస్మాన్, జాయింట్ సెక్రటరీ శుకూర్ ఖాన్, కమిటీ సభ్యులు ఫజర్ జమాత్ సభ్యుల ఆధ్వర్యంలో ఉపవాస కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ, ముస్లింలంతా కలిసిమెలిసి ఉండాలని మత గురువుతో ప్రార్థనలు చేసినట్టు తెలిపారు.



ఉపవాస దీక్షలో పాల్గొన్న ముస్లింలు

## శివలింగం పునఃప్రతిష్ఠ

ఇచ్ఛాపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ముచ్చింద్ర గ్రామంలో రత్నేశ్వర దేవాలయ శివలింగ పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి శాస్త్రోక్తంగా వేద పండితులచే పూజలు చేశారు. శుద్ధపూజ, అగ్నిపూజ, జవన్యాస ప్రతిష్ఠ పూజ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయా పాల్గొని ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ నారాయణమ్మ పాల్గొన్నారు.

## అభివృద్ధికి పునాది

బూర్జ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునఃనిర్మాణానికి పునాది లాంటిదని, అన్నివర్గాల ప్రజలను ఆదుకొనేలా ఉందని జనసేన పార్టీ బూర్జ మండల అధ్యక్షుడు కొత్తకోట నాగ్రేంద ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరించేలా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. అన్ని వర్గాలకు నిధులు కేటాయించారని, అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6,300 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. రూ.48 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను రూపొందించి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు.

## రంజాన్ దీక్షలు దిగ్విజయంగా జరగాలి

అరసవల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభం కానున్న పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు దిగ్విజయంగా నిర్వహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో క్రమశిక్షణ, శాంతి, సహనం, దానగుణంతో ఉపవాస దీక్షలు ప్రశాంతగా, ఆనందంగా కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఫరీద్‌పేట జంక్షన్‌కు సమీపంలో సర్వీసు రోడ్డులో శ్రీకాకుళం వైపు ద్విచక్రవాహనంపై పెయ్యలవానిపేటకు చెందిన బత్తిలి సత్యం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో సత్యం గాయపడ్డాడు. కాగా, కుశాలపురం సింహద్వారం వద్ద జాతీయ రహదారిపై ఓవర్‌పై అనంతపురం నుంచి వస్తున్న ఓ లారీలో డీజిల్ మొత్తం ఖాళీ కావడంతో నిలిపివేశారు. దీనిని గమనించిన జార్ఖండ్ వైపు వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో జార్ఖండ్ వెళ్తున్న లారీ డ్రైవర్ షేక్ అక్రమ్ అబ్దుల్ గాయపడ్డాడు. వీరిద్దరూ ప్రస్తుతం శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## చైతన్య దీపిక నూతన కార్యవర్గం

సోంపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీశయన చైతన్య దీపిక నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నారు. శ్రీశయన సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా దేవాడ మోహనరావు, గౌరవాధ్యక్షుడిగా వైద్యుడు ఏవీ రామకృష్ణ, కార్యదర్శిగా దుద్ది వీర్రాజు, సలహాదారులుగా దుద్ది శ్రీనివాసరావు, డాక్టర్ వెంకటేష్, ఉపాధ్యక్షులుగా బీన ఆనంద్, పొడుగు కామేష్‌ను ఎన్నుకున్నారు.

## చక్రధరునికి పల్లకీసేవ



బెజ్జిపుట్టుగలో స్వామివారికి పల్లకీసేవ

కవిటి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసియున్న చక్రధర పెరుమాళ్ల స్వామి డోలోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. 15రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో అనువంశిక ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్చకులు సత్యనారాయణ, నరసింహం, రాజేష్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు చేశారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శంకర్



చంద్రబాబుతో ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, మార్చి 02(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదివారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కలుసుకున్నారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ కుమార్తె నిశ్చితార్థం ఉయ్యూరులో జరిగింది. కార్యక్రమానికి హాజరైన సీఎంను.. శంకర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

## చంద్రబాబును విమర్శించే స్థాయి 'చింతాడ'కు లేదు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆమదాలవలస, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే స్థాయి వైసీపీ నాయకుడు చింతాడ రవికుమార్‌కు లేదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర రాజధాని అమరావతిని కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తున్నారని, ఆ విషయం కూడా తెలుసుకోకుండా అవగాహనా రాహిత్యంతో మాట్లాడడం తగదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో కాలం వెల్లదీసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ రూ.300 కోట్లు నిధులను మంజూరు చేయించి అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు గత ఐదేళ్లలో నిర్మించుకోలేని దుస్థితిలో వైసీపీ ఉంటే టీడీపీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే పూర్తి చేయించారన్నారు. సరుబుజ్జిలి మండలంలో జెన్‌కో ఆధ్వర్యంలో విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రవికుమార్ కృషి చేస్తుంటే.. అడ్డుకునేందుకు గిరిజనులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు సంపతిరావు మురళీ, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తంగి గురయ్య తదితరులు పాల్గొన్నారు.

## రమ్య తిరుమలలో చినజీయర్ స్వామి



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): త్రిదండి చిన జీయర్ స్వామి అరసవల్లి జంక్షన్‌లో ఉన్న రమ్య తిరుమల ఆలయానికి వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయన టెక్కలి వెళ్తు రమ్య తిరుమల చేరుకొన అనుగ్రహభాషన చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కరి రంగనాథవేమాధవాచార్యులు పూర్ణకుంభంతో చినజీయర్ స్వామిని స్వాగతం పలికారు. గిరజరాణి ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, అంపోలు మాజీ సర్పంచ్ మూర్తి, చినజీయర్ స్వామి శిక్షకులు పాల్గొన్నారు.

## చేపల కోసం ఎగబడిన జనం

శ్రీకాకుళం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్‌కు బదులు చేపలు, మటన్ తినేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. దీంతో నగరంలోని బలగ, రైతు బజార్ వెనుక, పెద్దచేపల మార్కెట్ ఇలా అన్నిచోట్లా చేపల దుకాణాలు ఆదివారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కిలో ధర రూ.200 పైబడి పలుకుతున్నా నిరీక్షించి కొనుగోలు చేశారు. రొయ్యలు, సముద్ర చేపలు, చెరువు చేపలు టన్నుల్లో విక్రయాలు జరిగాయి.



చేపలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

## మాజీ సైనిక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడిగా 'తాండ్ర'



సమావేశంలో పాల్గొన్న మాజీ సైనిక సంక్షేమ సేవా సంఘం సభ్యులు

ఆమదాలవలస, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ సైనిక సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన తాండ్ర జనార్దనరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం పట్టణంలోని పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న సైనిక సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో మాజీ సైనికుల ఫౌండర్ సూర అవతారం ఆధ్వర్యంలో గెలిచిన ప్యానెల్ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానెల్ అధ్యక్షుడిగా తాండ్ర జనార్దనరావు, ఉపాధ్యక్షుడిగా పేడాడ సూర్యారావు, జనరల్ సెక్రటరీగా నానుపాత్రుని రామారావు, కో-ఆర్డినేటర్‌గా పొన్నాడ శ్రీనివాసరావు, కోశాధికారిగా బొడ్డేపల్లి శ్రీనివాసరావులను సభకు పరిచయం చేశారు. జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ కటకం పూర్ణచం ద్రరావు, జామి రమణయ్య, బర్రి సంజీవరావు, అన్నెపు మురళీధరరావు, సనపల సత్యనారాయణ, పప్పల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా



డ్రోన్ కెమేరాతో తీసిన ఫొటో

కంచిలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి చుట్టు పక్కల గ్రామాల్లో ఆదివారం డ్రోన్ కెమేరాతో పరిశీలించామని తెలిపారు. ఇక ప్రతీ వారం డ్రోన్ కెమేరా సాయంతో పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. సోంపేట సీఐ బి.మంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## త్యాగరాజ ఆరాధనోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పిరమిడ్ ఆధ్యాత్మిక స్పిరుచ్యువల్ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి పీఠం అర్చకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ ఆధ్వర్యంలో చిన్నపిల్లలతో త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో సుసరాపు లక్ష్మీగణపతి శర్మ, స్వాతి సోమనాథన్, మార్గదర్శి శ్రీను, డాక్టర్ మాలతి, స్పిరుచ్యువల్ పిరమిడ్ మెడిటేషన్ సీఈవో శ్రీదేవి, దుంపల ఈశ్వరరావు, మావుడూరు శ్రీనివాస్ శర్మ, త్రివిక్రమ్ దేవ్ తదితరులు పాల్గొని త్యాగరాజన కీర్తనలు ఆలపించారు.

## మహిళల భద్రతపై అవగాహన

శ్రీకాకుళం క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారిత, మహిళల భద్రతపై విద్యార్థినులకు ఆదివారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ నెల 8న మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు యోగా, సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మహిళా దినోత్సవం నాడు బహుమతులు అందజేయనున్నారు.





# భవనం పూర్తయ్యేదెప్పుడో..?

- వరండాల్లోనే ఇన్‌పేషెంట్లు
- నిత్యం రద్దీగా ఉన్నా సదుపాయాలు సున్నా
- ఇదీ కొత్తూరు సీహెచ్‌సీ దుస్థితి

కొత్తూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆ ఆసుపత్రిలో ఓపీ రోజు రోజుకూ పెరుగుతోంది.. ప్రతిరోజూ సుమారు 200 మంది రోగులు వివిధ వైద్య సేవల నిమిత్తం వస్తారు. అయితే ఇక్కడికి వచ్చిన వారికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో రోగులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఇదీ కొత్తూరు సామాజిక ఆసుపత్రి దుస్థితి.. 30 పడకల ఆసుపత్రి పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2020లో నూతన భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.4.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే నాలుగేళ్లవుతున్నా భవనం పూర్తి కాలేదు. దీంతో పాత భవనంలో అరకొర సదుపాయాల నడుమ రోగులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆసుపత్రిలో సరైన వసతి, వార్డు సదు పాయాలు లేకపోవడం, పాత భవనంలో వరండాల్లో ఇన్‌పేషెంట్లకు బెడ్‌లు ఏర్పాటు చేయడంతో వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా ఈ ఆసుపత్రికి కొత్తూరు, భామిని, సీతంపేట, హిరమండలం మండలాలతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు వైద్య చికిత్సల నిమిత్తం వస్తుంటారు. రోజూ 200 వరకు ఓపీ ఉంటుంది. అలాగే ఇన్‌పేషెంట్లు చేరి వైద్య సేవలు పొందు తుంటారు. అయితే ఆసు పత్రిలో రక్త నమూనాల తనిఖీ, ఈసీజీ, ఆక్సిజన్ వంటి సౌకర్యాలున్నాయి. అయితే ఆసుపత్రి ఆవరణ అంతా పిచ్చి మొక్కలతో అనారోగ్యకర వాతావరణం నెలకొంది. వరండాల్లో మంచాలపై ఉన్న రోగులకు దోమలు, క్రిమి కీటకాల బెడద ఎక్కువగా పట్టి పీడిస్తోంది. దీంతో





అర్ధంతరంగా నిలిచిన నూతన ఆసుపత్రి భవనం (ఇన్‌సెట్‌లో) వరండాలో ఇన్‌పేషెంట్ వార్డు

ఆసుపత్రికి రావాలంటేనే రోగులు భయపడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేవలం ఓపీ చూపించుకుని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన బిడ్డలకు ఆక్సిజన్ వంటి సౌకర్యాలు ఉండడంతో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ అదే స్థాయిలో సరైన వసతి లేకపోవడంతో తల్లీబిడ్డలు ఉండేందుకు ఇష్టపడడం లేదు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత డ్యూటీలో ఉన్న సిబ్బందిని బట్టి ఉంటుందని రోగులు చెప్పుకోవడం కనిపిస్తోంది. ఈ ఆసుపత్రికి ఎక్కువ మంది గిరిజనులు వైద్య సేవల కోసం వస్తుండడం, వారికి సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

**సదుపాయాల్లేకే వరండాల్లో వార్డులు**

ఆసుపత్రిలో వసతి సౌకర్యం లేక ఎక్కువ మంది పేషెంట్‌లు ఉన్నప్పుడు వరండాలో వార్డులను ఏర్పాటు చేస్తున్నాం. నూతన భవనం ఈనెలాఖరకు అప్పగిస్తే ఆసుపత్రి వసతి సమస్య తీరు తుంది.

-ధర్మాన కిశోర్, సూపరింటెండెంట్

## క్రైం కార్నర్

### నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న ఎస్‌ఐ హరిబాబు నాయుడు

సోంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బారువ కొత్తూ రు గ్రామానికి చెందిన వలి శెట్టి తులసి తోటి ఉద్యోగి మద్ది ప్రదీప్ వేధింపులు తాళ లేక ఇటీవల ఆత్మహత్య చేసు కుంది. ఈ మేరకు ఆమె తండ్రి హేమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ హరిబాబు నాయుడు కేసు నమోదు చేసి విచారణ చేప ట్టారు. ఈ నేపథ్యంలో నిందితుడు మద్ది ప్రదీప్‌ను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

### క్రేన్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన కృష్ణారావు

కంచిలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బూరగాం గ్రామానికి చెందిన గుజ్జు కృష్ణారావు ఎస్‌ఎం పురం గ్రామానికి చెందిన తమ సమీప బంధువు మృతి చెందడంతో ఆదివారం పరామర్శించేందుకు వెళ్లాడు. తిరిగి నడుకుంటూ జాతీయ రహదారి పక్క సర్వీసు రోడ్డులో వస్తుండగా వెనుక నుంచి వస్తున్న క్రేన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణారావు కుడి చేతిపై నుంచి క్రేన్ చక్రం వెళ్లడంతో విరిగిపోయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమితం సోంపేట సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

### బైక్ ఢీకొని వృద్ధుడికి..



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పలాస, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పారసంబ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.రాము అనే వృద్ధుడికి వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. వృద్ధుడి రెండు కాళ్లపై నుంచి వాహనం వెళ్లడంతో విరిగి పోయాయి. 108 సిబ్బంది సత్యం, నగేష్ హుటాహుటిన పలాస ప్రభుత్వాసు పత్రికి తరలించగా సిబ్బంది చికిత్స అందించారు. అనంతరం ఆయనను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న కంచిలి మండలానికి చెందిన మీనకేతన్‌దొలై మోటారు వాహనంపై అతివేగంతో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమౌళి తెలిపారు.

### సారవకోట వైస్ ఎంపీపీ 'యడ్ల' మృతి



అసిరయ్య (ఫైల్)

జలుమూరు(సారవకోట), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల ఉపాధ్యక్షుడు (వైస్ ఎంపీపీ) యడ్ల అసిరయ్య (85) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారు జామున స్వగ్రామం అన్నుపురంలో మృతి చెందారు. ఈయన రెండు పర్యాయాలు అన్నుపురం సర్పంచ్‌గా, సారవకోట సొసైటీ ఉపాధ్యక్షుడిగా, పెద్దలంబ ఎంపిటిసిగా పనిచేశారు. అన్నుపురంలో జరిగిన అంత్యక్రియలకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాసు హాజరై నివాళులు అర్పించారు. అసిరయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.

### బడ్జెట్‌పై విషం చిమ్మడం దారుణం: జడ్పీటీసీ



మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు

హిరమండలం, మార్చి2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలకు చేరువై అందరి మన్ననలు పొందుతున్నప్పటికీ వైసీపీ నాయకులు విషం చిమ్ముతుండడం దారుణమని జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించడంతో ప్రజల్లో వస్తున్న సానుకూల స్పందన చూసి ఓర్వలేక తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం తెలుగు భాషను అణగదొక్కగా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో తెలుగు భాషాభివృద్ధికి నిధులు కేటాయించి ప్రతీ తెలుగువాడు గర్వపడేలా చేసిందన్నారు. వ్యవసాయం దండగ అని కూతలు కూసిన వైసీపీ నాయకులకు కనువిప్పు కలిగేలా వ్యవసాయానికి సుమారు రూ.50 వేల కోట్లు కేటాయిచి రైతులకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వ నిలిచిందన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కిల్లాన తిరుపతిరావు, బల్ల కిశోర్, గులివిందల గణేష్,ఈశ్వరరావు, దేవా తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణ తరగతుల పరిశీలన

పలాస, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపల్ కార్యాలయం ఆవరణలోని మెప్మా విభాగంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్ శిక్షణ శిబిరాలను మెప్మా పీడీ ఎస్వీ రమణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ట్రేడుల్లో శిక్షణ పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ యాప్‌లో పొందు పరచడం జరుగుతుందన్నారు. దీని వల్ల శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు టి.రాజ్యలక్ష్మి, జీవన్, సిటీ మిషన్ మేనేజర్ పి.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీనరేజ్ చార్జీలు చెల్లించారా?

(ఐదో పేజీ తరువాయి)

చెల్లించిన పన్నుల అంశంపై సరైన సమాచారం లేకపోవడంతో వాణిజ్య పన్నుల శాఖ సమన్లు జారీచేసింది. ఈ నేపథ్యంలో క్వారీ యాజమాన్యాలు చెల్లించిన సీనరేజ్ చార్జీలు అసలు ఎక్కడకు వెళ్తున్నాయన్నది ప్రశ్నగా మారింది. విశ్వసముద్ర సంస్థ గ్రానైట్ యంత్రాంగం వద్ద వసూలు చేసిన పన్నులు ప్రభుత్వానికి చెల్లించిందా? లేదంటే నొక్కేసిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు మళ్లీ పన్నులు చెల్లించాలంటూ తమపై మరింత భారం పడుతుందని క్వారీల యాజమానులు తలలు పట్టుకుంటున్నారు.

● ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఉప్పాడ కేశవరావు వద్ద ప్రస్తావించగా నరసన్నపేట సర్కిల్ పరిధిలో 58 గ్రానైట్ క్వారీలకు సమాన్లు జారీ చేశామని తెలిపారు. ఈనెల 6వ తేదీలోగా కార్యాలయానికి వచ్చి సమాచారం తెలియజేయాలని అందులో పేర్కొన్నామన్నారు.

# రసవత్తరంగా కబడ్డీ పోటీలు

పలాసరూరల్, మార్చి2(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం బొడ్డపాడు, బాహడాపల్లి జట్ల మధ్య పోటీ ఆసక్తికరంగా సాగింది. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, మందస, మామిడిపల్లి జట్లు పోటీపడ్డాయి. పోటీని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, ప్రజలు హాజరయ్యారు. పోటీలను టీడీపీ పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న చౌదరి తిలకించారు. కార్యక్రమంలో బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



హోరాహోరీగా సాగుతున్న కబడ్డీ పోటీ

**మేలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు**

పలాస, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను మే 16, 17, 18 తేదీల్లో పలాసలో నిర్వహిస్తామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్న చౌదరి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలు, క్రీడాకారులతో సమావేశం నిర్వహించారు. గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో పలాసలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జాయిట్ సెక్రటరీ రాపాక అప్పలస్వామి, టీడీపీ నాయకులు గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, పీసీఎంఎ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్నచౌదరి

### ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉద్దానం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జుత్తు కూర్మారావు


హరిపురం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో భాగంగా కూటమి ప్రభుత్వం మందస మండలం బిడిమి వద్ద ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఎయిర్ పోర్ట్ సాధన కమిటీ అధ్యక్షుడు జుత్తు కూర్మారావు అన్నారు. బిడిమి గ్రామంలో ఎయిర్ పోర్ట్‌కు మద్దతుగా ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు దివంగత ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు సోదరుడు జుత్తు కృష్ణమూర్తి, స్మార సారధి, కె.రామారావు తదితరులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కృషితో మంజూరైన ఎయిర్‌పోర్ట్‌కు తాము పూర్తిస్థాయిలో మద్దతిస్తున్నా మన్నారు. భూములు కోల్పోయిన రైతులకు మంచి ప్యాకేజీతోపాటు, మంచి పునరావాసం, యువతకు, మహిళలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలని కోరారు. ఎయిర్‌పోర్ట్‌తో కలిగే లాభాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తా మన్నారు. కొందరు సెంటు భూమి ఎయిర్‌పోర్ట్‌కు ఇవ్వకపోయినా నాయకులుగా చెలామణి అయి అభివృద్ధికి అడ్డుపడుతున్నారన్నారు. ప్రజా సంఘాల పేరుతో మరికొందరు స్థానికులను రెచ్చగొట్టి పబ్బంగడుపు కుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జుత్తు అమ్మి నాయుడు, రామారావు, లక్ష్మయ్య, దున్న గణేష్, లోకనాథం, సోమే శ్వరరావు, ఆదర్శ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## కష్టాల సాగు..

(ఐదో పేజీ తరువాయి)

పెట్టుబడి పెట్టారు. కాగా.. వంశధార కాలువల ద్వారా సాగునీరు రాలేదు. దీంతో చివరి దశలో వరి పంట ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి రెండేసి నీటి ఇంజన్లు ఏర్పాటు చేసి నీరు కడుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత కూడా పెరగడంతో నీటితడులు చాలడం లేదని వాపోతున్నారు. ఎకరాకు రూ.20వేల వరకూ పెట్టుబడి పెట్టామని, పంట దక్కే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు. వేరుశనగ సాగు చేసిన రైతులదీ అదే పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎస్బీసీ కాలువ, మెయిన్ కాలువ ద్వారా ఈ నెలాఖరు వరకైనా నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. వంశధార నదిలో నీటిని ఎడమ కాలువ ద్వారా విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.గొట్టాబ్యారేజీలో నీటినిల్వలు లేకపోవడంతో కాలువల్లో నీరు విడిచిపెట్టడం లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

### కుక్కల స్వైర విహారంతో ఆందోళన



చల్లవానిపేట కూడలిలో

జలుమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కల గుంపులతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బాటసారులు, వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులశాలల్లో కట్టిన లేగదూడలపై కూడా కుక్కల గుంపు దాడి చేసి మృత్యువాతకు గురిచేస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మమ అనిపించేశారు

- ఎన్నికల కోడ్‌తో సమావేశంపై సభ్యుల అనాసక్తి
- ఇదీ మండల సమావేశం తీరు

పాతపట్నం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సమావేశంలో ఎటువంటి తీర్మానాలకు అవకాశం లేకపోవడంతో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా నిర్వహించారు. వాస్తవానికి శనివారం ఈ సమావేశం నిర్వహించేందుకు సభ్యులందరికీ ఆహ్వానాలు అందించారు. అయితే అసెంబ్లీ సమావేశాలున్నందున మండల సమావేశానికి రాలేమని పాలకులు పేర్కొనడంతో ఆదివారం నిర్వహించేందుకు ఈ మేరకు సభ్యులకు ఆదివారం హాజరు కావాలని అధికారులు పేర్కొన్నారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల ఎటువంటి తీర్మానాలు చేసేందుకు అవకాశం లేకపోవడంతో పలువురు సభ్యులు ఆసక్తి కనబరచలేదు. అయితే 18 మంది సభ్యులుండగా 8 మంది మాత్రమే హాజరు కాగా కోరం మేరకు సమావేశం ప్రారంభించి మమ అనిపించేశారు. పాతపట్నంలోని శ్మశాన వాటికలో బోరు వేయించి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని పాతపట్నం ఎంపీటీసీ సభ్యులు కొండాల యరకయ్య, పోలాకి రేణుక కోరారు. గురండి, బగదల, రట్టిపేట గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జల్ జీవన్ పనులు చేపట్టినప్పటికీ తాగునీరందడంలేదని సర్పంచ్ తులసి నాయుడు పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీటీసీ లింగాల ఉషా రాణి, ప్రత్యేకాధికారి డా.మంచు కరుణాకర రావు,ఈవోపీఆర్డీ ఎల్.వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు కొండాల యరకయ్య

# 16 ఏళ్లు దాటినా ఈ శకటమే ఆధారం

- సమస్యల పరిష్కారానికి మార్గమేదీ?
- ఆరు మండలాలకు ఇక్కడి నుంచే సేవలు
- ఇదీ టెక్కలి అగ్నిమాపక కేంద్రం తీరు

టెక్కలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం టెక్కలి అగ్నిమాపక కేంద్రం సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కేంద్రంలో అనేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఈ కేంద్రం పరిధిలో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా తక్షణం వెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఉపయోగిస్తున్న వాహనం 16 ఏళ్ల కిందటిది కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాస్తవానికి 15 ఏళ్లు దాటిన వాహనాన్ని పక్కకు పెట్టి కొత్త వాహనం వినియోగించాల్సి ఉన్నా కొత్త వాహనం లేక పోవడంతో పాత దానినే వినియోగించాల్సి వస్తోంది. అలాగే స్టేషన్ ఫైర్‌ఆఫీసర్, ఫైర్‌మెన్స్ లీడింగ్ ఫైర్‌మెన్స్ డ్రైవర్లు, డ్రైవర్ కమ్ ఆపరేటర్ ఇలా 22మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ఒక డ్రైవర్, నాలుగు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలీచాలని సిబ్బందితో పాటు హోంగార్డ్‌తో నెట్టుకొస్తున్నారు. ఇక్కడున్న అగ్ని మాపక సిబ్బందికి కనీసం క్వార్టర్స్ కూడా లేవు. ఈ కార్యాలయానికి బోర్‌వెల్ లేకపోవడంతో గ్రామపంచాయతీ కొళాయి నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది.

**ఆరు మండలాలకు ఇదే శకటం..**

టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, మెళియాపుట్టి, పాతపట్నం మండలాలతో పాటు వజ్రపుకొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో అగ్ని ప్రమాదం జరిగినా ఇక్కడి నుంచే అగ్నిమాపక శకటం వెళ్లి మంటలను అదుపులోకి తీసుకురావాల్సి ఉంది. ఇప్పటికే ఇల్లు దగ్ధం, గడ్డి, వరి కుప్పలు, గ్యాస్‌లీక్, ఎలక్ట్రికల్ ఫైర్, ఫారెస్ట్ ఫైర్ తదితర అగ్ని ప్రమాదాలు ఏడాదికి 65 నుంచి 70 వరకు జరుగుతున్నాయి. మెళియాపుట్టి, పాతపట్నం శివారు ప్రాంతాలకు, సంతబొమ్మాళి మండలం తీరప్రాంతాలకు అయితే ఇక్కడి నుంచి వాహనం వెళ్లే సరికే కాలిబూడిదైపోతున్నాయి. ఈ వాహనం 40, 50 కిలోమీటర్లకు మించి వెళ్లలేక పోతోంది. దీంతో అగ్ని ప్రమాద సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరు తున్నారు. ఈ విషయమై ఎస్‌ఎఫ్‌వో బి.సూర్యారావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా కొత్త వాహనానికి ప్రతిపాదనలు చేశామన్నారు. సిబ్బంది కొరత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.



కాలం చెల్లిన అగ్నిమాపక శకటం ఇదే..

## న్యూస్ బాక్స్

### రంజాన్ ఉపవాస దీక్షలు దిగ్విజయం కావాలి



టెక్కలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అల్లా దయతో క్రమశిక్షణ, శాంతి, సహనం, దాన గుణంతో ఉపవాస దీక్షలు దిగ్విజయంగా సాగాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయు డు పేర్కొన్నారు. రంజాన్ మాస ఉపవాస దీక్షలు ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీ మణులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### నేడు శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

టెక్కలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో సోమవారం సాయంత్రం శ్రీరామ పాదుకా పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి హాజరవు తున్నట్లు వికాస తరంగిణి ప్రతినిధి మూల వేమన తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### పట్టణ శిష్టకరణ సంఘ అధ్యక్షుడిగా రాంబాబు



నరసన్నపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శిష్టకరణ సంఘ అధ్యక్షుడిగా సదాశివుని రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆదివారం స్థానిక సంఘ భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడిగా ఇప్ప టివరకు పనిచేసిన సదాశివుని కృష్ణ బాధ్యతల నుంచి తప్పుకోగా సభ్యులు రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

### సారా రహిత గ్రామాల ఏర్పాటుకు 'నవోదయం'

పాతపట్నం, మార్చి2(ఆంధ్రజ్యోతి): సారా, గంజాయి, డ్రగ్స్ రహిత గ్రామాల ఏర్పాటు లక్ష్యంగా నవోదయం 2.0 అమలు చేస్తున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నవోదయం 2.0పై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధి బొన్ని, కోణంగి, పూతికగూడ, చాపరాయిగూడ గ్రామాలను సారా గ్రా మాలుగా గుర్తించి బి కేటగిరిలో చేర్చామ న్నారు. ఈ గ్రామాల్లో విస్తృత దాడులు చేపడతామన్నారు. అలాగే సారా ముడి సరుకు బెల్లం సరఫరా చేసి వ్యాపారులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఐదు అంచెల్లో సారా తయారీ గ్రామాలపై దాడులు చేస్తున్నామని చెప్పారు. ఎక్సైజ్ నేరాల నియంత్రణకు ప్రజలు టోల్‌ఫ్రీ నెం బర్ 14405కి ఫోన్ చేసి సహాయ సహ కారాలు అందించాలని కోరారు. ఒపీపీ దొర సావిత్రమ్మ, జడ్పీ టీసీ లింగాల ఉషారాణి, మండల ప్రత్యేకాధికారి డా.మంచు కరుణాకరరావు, డీటీ రమణ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ మృతి



వడ్డి రాజు (ఫైల్)

వజ్రపుకొత్తూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డోకులపాడుకు చెందిన వడ్డి రాజు (32) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ నిహార్ తెలి పిన వివరాలా ఉన్నాయి.. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న రాజు పెళ్లయి పదేళ్లు దాటినా పిల్లలు పుట్టలేదని నిత్యం బాధపడుతుండేవాడు. దీంతో మద్యానికి బానిసై మనస్తాపం చెంది శని వారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో తలకు రాసుకున్న ఆయిల్ తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమినించి ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.